
యథాప్రకారం విక్రమార్కుడు చెట్టు మీద నుండి శవాన్ని దింపి, భుజాన వేసుకున్నాడు. నడక ప్రారంభించగానే శవంలోని భేతాలుడు, "రాజా, నీకు శ్రమ తెలియకుండా ఉండటానికి ఓ కథ చెబుతా విను." అని మొదలు పెట్టాడు.




## డా॥ గాయత్రీదేవి
# ఈ ప్రశ్నకు బదులేది?

ఆంధ్రదేశంలోని పల్లెటూళ్లలో ఒకటి పెంట పాడు. ఒకప్పుడు పంటలు బాగా పండుతూ ఉండి దాన్ని పంటపాడు అనే వారేమో, కాలక్రమేణా పంటపాడు అపభ్రంశంచెంది 'పెంటపాడు' అయ్యుండవచ్చేమో గానీ, ప్రస్తుతం ఆ ఊరు సార్థక నామధేయంతో ఉంది. ఆ ఊరి జనాభాలో సగానికి పై చిలుకు, దారిద్ర్యానికి దిగువన ఉన్న వారు, మరో నలభై శాతం ఆ గీతకు కాస్త పైనున్నవారూనూ. అంతా కూలీ నాలీ చేసుకునే వారూ. ఆదాయం పెద్దగా లేని వృత్తి పనులమీద ఆధారపడినవారూనూ.

చదువుకునేందుకు పాఠశాలలున్న ప్రాంతాలలోనే నిరక్షరాస్యత తాండవిస్తుంటే, పెంటపాడులో పరిస్థితి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అజ్ఞానం, దారిద్ర్యం జంటగా ఉండటంతో అనారోగ్యానిదే పై చేయి అయిందక్కడ.

ప్రభుత్వంవారి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం శంకుస్థాపనకి వేసిన రాయిలా ...పేరుకు మాత్రమే ఉన్నది. అక్కడ ఎప్పుడూ మందులు ఉండవు. ఎప్పుడయినా మందులుంటే ఇవ్వడానికి డాక్టరుండడు. ఎప్పుడో ఏడాదికో, రెండేళ్లకో ఓ డాక్టరు రావడం, వారం తిరక్కుండానే బదిలీ చేయించుకుని వెళ్లిపోవడం..... పరిపాటి అయిపోయింది.

ఆరోగ్యంగా ఉంటే పెంటపాడు ప్రజలు మహాభాగ్యంగా ఉండేవారో లేదో కానీ, అనారోగ్యం మాత్రం వారి దారిద్ర్యాన్ని రోజురోజుకు పెంచుతోంది.

కొన్ని కొన్ని రోగాలు రోగుల సంపదకి చిహ్నాలయితే ....

కొన్ని రోగాలు దారిద్ర్యాన్నే తరుముకుంటూ వస్తాయి. పెంటపాడు అంటువ్యాధులకి ఆలవాలమయింది.

ఆ వ్యాధులకి కొన్ని ప్రాణాలు బలయ్యేవి. కొందరు జీవచ్ఛవాల్లా మిగిలేవారు. బాధలను సహించి సహించి రాటు దేలిపోయారు అక్కడి ప్రజలు.

కండలు కరిగిపోతున్నా, గుండెలు మాత్రం బండల్లా తయారయ్యాయి వారికి.

* * *

ఎమ్.బి.బి.ఎస్ పూర్తి చేసిన వేణు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తాత్కాలిక ఉద్యోగాలకు ధరకాస్తులు కోరుతూ పేపర్లో వచ్చిన ప్రకటన చూశాడు. నెల జీతం కాదు. రోజువారీ వేతనం. సెలవులుండవు, అంటూ ఆ ప్రకటనలో ఇచ్చిన వివరాలు కూడా చదివాడు.

పల్లె ప్రాంతాలలోని అనేక హెల్త్ సెంటర్లలో డాక్టర్లు లేరు.

ప్రజలు ఇబ్బంది పడుతున్నారు కొన్నేళ్లుగా.

ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగాకూడా లేకపోయింది, ఇంతకాలమూ ప్రజలతో అవసరం లేక.

ఎన్నికలు వస్తున్నాయి. ఇప్పుడిక ప్రజలతో అవసరం. ఓట్లు అత్యవసరం.

తమ అవసరాలు తీర్చుకోవాలంటే. అంతో ఇంతో ప్రజల అవసరాలని, కనీసం ఎలక్షన్ల సమయంలోనయినా తీర్చడం ఆనవాయితీ నడుస్తోంది. ఆనవాయితీని కాదనలేరు. కాదంటే ప్రజలు తమనే కాదంటారు. ప్రజలు కాదంటే దారిలేదు నాయకులకు. గెలుపుకోసం తప్పుడు దారులెన్నో ఉన్నా ...కొంతయినా ఒప్పుగా కనబడేలా చేసుకోక తప్పడంలేదు నాయకులకు.

కారణం......తప్పులెన్నడానికి సిద్ధంగా ఉండే ప్రతిపక్షనాయకులు ప్రజలని కూడగట్టి, తమని ప్రతిపక్షంలో కూర్చోబెట్టేస్తారనే భయం...

ఒప్పుగా కనబడవలసిన దారిలోకి కనిపించే ప్రయత్నాలలో ఒకటే ... డాక్టర్ల పోస్టులని టెంపరరీగా భర్తీ చేస్తామనే ప్రకటన. డాక్టర్ల

నియామకానికి ఇంటర్వ్యూలు ఏర్పాటుచేసే తీరికా ఓపికా ప్రస్తుతం ప్రభుత్వానికి లేవు. ఎవరు ముందొస్తే వారికే పోస్టు అన్నారు.

వేణు దరఖాస్తుతో పోస్టులు భర్తీ చేస్తున్న ఆఫీసుకి వెళ్లాడు. అతను దరఖాస్తు చేస్తున్న పెంటపాడులో పోస్టు కోసం అంతవరకూ ఎవ్వరూ రాని కారణంగా.... వెంటనే వెళ్లి వేణుని పెంటపాడు హెల్త్ సెంటర్‌లో చేరిపొమ్మని ఆర్డర్లిచ్చేశారు... ఆ క్షణంలోనే!

అంతా యుద్ధప్రాతిపదికలో జరిగిపోతోంది. ఆపని తీరు చూసిన వారికి నిరంతరం ఎన్నికలు జరుగుతూంటే బావుండుననిపించింది.

వేణు ఆరోజే పెంటపాడులో చేరిపోయాడు. కొత్త డాక్టర్ వస్తున్న వార్త ఊరంతా క్షణాల్లో తెలిసిపోయింది. రెండేళ్లుగా డాక్టరు లేడా సెంటర్లో.

అంతకుముందు నామకః ఉన్న డాక్టర్ నాలుగురోజులకోమాటు వచ్చి టౌన్లో తన నర్సింగ్ హోమ్‌లో చికిత్స చేయించుకొమ్మని సలహా ఇచ్చేవాడు. ఆ తరవాత ఆదే టౌనుకి బదిలీ చేయించుకుని వెళ్లిపోయిడు.

కొత్త డాక్టర్ రాక ప్రజలలో ప్రత్యేకానందాన్నేమీ కలిగించలేదు. ఈయనా ఒక వారం కన్నా ఉండడులే అన్న నిర్లిప్త భావంతోనే ఉన్నారు.

ఎవరెన్నాళ్లుంటే అంతకాలం చూపించుకుందాం. అని అనారోగ్యంతో బాధపడుతున్న వారు...వేణు దగ్గరికి వెళ్లి వైద్యం చేయించుకోవడం మొదలు పెట్టారు. వైద్యానికి వెళ్లినవారు తృప్తిగా తిరిగి వస్తున్నారు.

వేణు ఏరోజూ సెలవు పెట్టకుండా, సరయిన సమయానికే ఆస్పత్రికి వచ్చేవాడు. నిర్ణీత సమయం దాటితేగానీ వెళ్లిపోయేవాడు కాదు. ప్రతీరోగినీ శ్రద్ధగా పరీక్షించేవాడు. విసుగులేకుండా అందరినీ ఆత్మీయంగా పలకరించేవాడు. అలవాటుగా కాకపోయినా చేతిలో నోట్లు పెట్టబోతుంటే, ప్రేమగా తిరస్కరించేవాడు.

వేణు ప్రవర్తన ఊరివారికి అతణ్ని దగ్గర చేసింది. డాక్టర్ ఊళ్లోలేని సమయంలో రోగం వస్తే ... మర్నాడు అతను వచ్చేవరకూ బాధని ఓర్చుకుంటూ ఉండిపోయేవారేగానీ, టౌనుకు వెళ్లేవారు కాదు.

ప్రజల ఆత్మీయతకి స్పందించిన వేణు తన మకాం పెంటపాడుకు మార్చేశాడు. ప్రజలే అతనికి రెండుగదుల ఇల్లు ఏర్పాటు చేశారు.

వృత్తిలోకాక వ్యక్తితో సంబంధం ఏర్పడటంతో వేణు చెప్పిన మాటే వేదంలా పాటించేవారు గ్రామస్తులు. డాక్టర్ వేణు ఆదర్శాలు వల్లించిన వాడు కాదు. చదువుకునే రోజుల్లో చదవడమే కర్తవ్యం అనుకునే వాడు. డిగ్రీ అయిన తరువాతసేవ చేస్తానని శపథమూ పట్టలేదు. ధరార్జన చేసితీరాలనే ధ్యేయమూ పెట్టుకోలేదు. డిగ్రీ కాగానే రోగికి తను స్వయంగా వైద్యం చేయగలిగే సామర్థ్యం, ఆత్మవిశ్వాసం కలిగేవరకూ అనుభవజ్ఞుల దగ్గర పనిచేశాడు. ప్రభుత్వ ప్రకటన చూసి ప్రయత్నిద్దాం అనుకున్నాడు. పెంటపాడులో అడుగుపెట్టాడు. ప్రజల అభిమానానికి స్పందించిన వేణుకి వైద్యమే తపస్సయింది. కర్తవ్యనిర్వహణ చేసేవారే కరువయిన రోజుల్లో వేణువంటివారు కనబడితే మహనీయులనే అనాలి.

పెళ్లయిన పదేళ్లకి నరసమ్మ గర్భవతి అయింది- అని మొగుడు పెళ్లాలు సంబరంగా పండగ చేసుకున్నారు. కాన్పు కష్టమయింది. ఎట్టకేలకు మంత్రసాని, బిడ్డని బయటికి తీసింది. పసిబిడ్డలో చలనంలేదు. ఏడుపులేదు. శరీరం నీలంగా ఉంది. నరసమ్మ, మొగుడు ఏడుపు మొదలెట్టారు. వార్త వేణుకి చేరింది. తక్షణమే తన మందులపెట్టితో అక్కడికి చేరిపోయాడు. బొడ్డు తాడు లోనికి మందెక్కించాడు. పసిగుడ్డునోటి మీద. తననోరుపెట్టి గాలి అందించాడు. బిడ్డను తలకిందులుగా పట్టుకుని నెమ్మదిగా వీపుమీద చరిచాడు. చంటిబిడ్డ కేరుమన్నాడు. నరసమ్మా, మొగుడూ అతని కాళ్లమీద పడిపోయారు. ఆ బిడ్డకి వేణు అని పేరుపెట్టుకున్నారు. గ్రామస్థులంతా ఏదో అద్భుతాన్ని చూస్తున్నట్టు నిలబడిపోయారు.

మరోసారి వీరమ్మ కొడుక్కి తీవ్రమైన జ్వరం వచ్చింది. ఆగకుండా వాంతులయ్యాయి. పిల్లవాడికి స్పృహలేదు. ఏటా, అలాంటి జ్వరంతో పిల్లలు చనిపోవడం చూస్తున్న గ్రామస్థులు, ఇక ఈ బిడ్డ ఆయుష్షు తీరిపోయిందని, అనుకుంటూ వేణు దగ్గరికి తీసుకొచ్చారు. 'పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేను' అంటూ, గ్లూకోజ్ సీసాల్లో మరికొన్ని మందులు కలిపి, పిల్లవాడ నరంలోకి ఎక్కించడం ప్రారంభించాడు. రెండురోజుల నిరంతర చికిత్సతో పిల్లాడి ప్రాణం దక్కింది. ఊరివారంతా వేణు కాళ్లకి సాష్టాంగ పడిపోయారు. ప్రజల అజ్ఞానం, ఆత్మీయతా అతని మనసును కదిలించాయి. పిల్లాడికి నయం కావడం తన ప్రతిభ కాదనీ రోగం తీవ్రస్థితికి చేరలేదు కనకనే తాను నయం చేయ్యగలిగానని చెప్పాడు వేణు. ఆ విధంగా మాట్లాడ్డం అతని వినయానికి నిదర్శనం అన్నారు జనం.

ఆ సమయంలోనే నిశ్చయించుకున్నాడు వేణు, ఊరివారికి పరిసరాల పరిశుభ్రత,



## చిన్న ఇంటర్వ్యూలే నాకిష్టం!

**లేవగానే ఏం చేస్తావు?**

పళ్లు తోముకుంటా.

**పడుకోబోయే ముందు?**

తల ఓ సారి దువ్వుకుని అద్దంలోని నా ప్రతిబింబాన్ని చూసి నవ్వుతాను.

**తీరిక వేళల్లో ఏం చేస్తావు?**

కవిత్వం రాస్తా. లేదా నా కాసియో వాయిస్తాను.

**నువ్వు చాలా 'రొమాంటిక్ పర్సన్'ఏటగా?**

అవును, చాలా!

**నువ్వు మరవలేని సంఘటనలున్నాయా?**

చాలా వున్నాయి. మదర్ థెరెసాను కలవడం, మిస్సిండియా, విశ్వసుందరి కావడం... చాలా గుర్తుండిపోయిన విషయమేమిటంటే- విశ్వసుందరిగా నేనందరికీ తెలిసిపోయాక, ఎందరో నాకు పూలగుత్తులు తెచ్చి బహూకరించారు. ఒకప్పుడు తమ పనులు చేసుకోడానికే తీరికలేని జనం, ఇప్పుడు నాకు ఓ ఉత్తరం రాయడానికీ, కార్డులూ, పువ్వులూ పంపడానికీ బోలెడంత సమయాన్ని వెచ్చించడం!-అని నవ్వుతూంది సుస్మితాసేన్.

ఆరోగ్యరక్షణ అర్థమయ్యేలా తెలియజేయాలని, వారిని అజ్ఞానాంధకారంనుండి రక్షించాలనీ. తీరిక సమయాలలో, ఊరిలో కొత్తగా ఏర్పాటయిన పాఠశాలకి వెళ్లి పిల్లలందరికీ కథలు చెప్పినట్లుగా ఆరోగ్యం గురించి చెప్పేవాడు. మురుగు, రోగాలు, సూక్ష్మజీవులు అనే పదాలే తెలియనివారి మనసులకీ, వాటివల్ల కలిగే నష్టాలు బోధించేవాడు. పిల్లలు ఇంటిదగ్గర పెద్దలకి చెప్పేవారు. వారంతా వేణుచెప్పిన మాటలు కనక ఆచరించసాగారు.

ఊరంతా పరిశుభ్రంగా తయారయ్యింది. ప్రజల ఆరోగ్యం మెరుగైంది. ఆరోగ్యం ఆర్థికపరిస్థితిని పెంచింది. పేదప్రజల ముఖాల్లో జీవకళ వచ్చింది. పెంటపాడు పంటపాడులా మారుతోంది. అంటువ్యాధి అన్నమాటే లేదు.

పెంటపాడులో, అక్కడి ప్రజల్లో వేణుస్థానం స్థిరపడిపోయింది.

రెండుసంవత్సరాలు గడిచాయి.

ఎన్నికలైపోయిన వెంటనే పాలకపక్షంవారు తమ పెట్టుబడి వడ్డీతోసహా రాబట్టుకునే ప్రయత్నంలో నిమగ్నమైపోయారు. మళ్లీ ఎలక్షన్లకి కూడా జేబులు నింపుకుని సిద్ధంగా ఉండడానికి సిద్ధమయ్యారు. అటువంటి వనరుల్లో ఒకటి సర్వీస్ కమీషన్. డాక్టర్ల పోస్టులని శాశ్వతంగా భర్తీ చెయ్యాలి కనక ఇంటర్వ్యూలకి దరఖాస్తులు కోరుతూ పేపర్లో ప్రకటన ఇచ్చారు. వేణు మనసు స్థిరంగానే ఉన్నా, పెంటపాడు ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. డాక్టర్ వేణుని పెంటపాడులోనే ఉంచుతారా లేదా అన్నది చర్చనీయాంశం అయింది.

"డాక్టర్ బాబుని మన ఊళ్లోనే వేస్తారంటావా?"

"అసలు డాక్టర్‌బాబుని గవర్మెంటు ఉద్యోగంలో ఉండనిస్తారో లేదో?"

"ఆయన గవర్మెంటు డాటరేగా!"

"అపుడు తాత్కాలికంగా కనబడ్డవోళ్లనల్లా వేశారట. ఇపుడు ఆళ్ల తెలివి పరీచ్చించి మంచి డాట్టర్లనే ఏస్తాం అంటున్నారు."

"ఇంకా మన డాటరీబాబుని పరీచ్చ చేసేదేంటి? కళ్లెదురుగుండా కనబడుతోంది కదా, ఆయన దేవుడే!"

"మనక్కనబడితే ఆళ్లకేం. ఆళ్లడిగే ఎర్రిమొర్రి ప్రశ్నలకి జవాబు చెబితే చాలు, రోగాలు నయం చెయ్యకపోయినా పరవాలే!"

"ఇవన్నీ ఉత్తుత్తి మాటలేనంట. ఆళ్ల చేతుల్లో డబ్బులెడితే కులాసాగా నీ పేరేంటి ఊరేంటి అని అడిగి, ఉద్యోగం ఇచ్చేత్తారంట. లోకమంతా డబ్బుమీదే నడుస్తోంది?"

"మన డాట్టరీబాబు లంచం ఇస్తాడంటావా?"

"ఇవ్వడు. మన పదిరూపాయలిస్తే పుచ్చుకోని మనిషి, ఇంకోళ్లకి లంచం ఇస్తాడా?"

"మనలో మనం చర్చించుకుని లాభంలేదు. ఆయనతోనే మాట్లాడదాం" అనుకుని, వేణు దగ్గర కెళ్లారు.

తాము విన్నదీ, తమ మనసులో ఉన్నదీ, చెప్పారు అతనితో.

"లంచం ఇస్తేకానీ పని జరగదని నా స్నేహితులు కూడా చెబుతున్నారు. నేనేమీ గొప్ప ఆదర్శవాదిని కాదు. ఏపనయినా సక్రమంగా జరగాలన్నది నా కోరిక. నేనింత వరకూ అడ్డదారిలో ఏపనీ చెయ్యలేదు. ఇకమీదకూడా నా పద్ధతిలో మార్పు ఉండదు. ఎలా జరగవలసి ఉంటే అలా జరుగుతుంది. నేను కాకపోతే మరో మంచి డాక్టర్ రావచ్చు" అన్నాడు వేణు.

"మీరు ఎక్కడున్నా మీకు బాధలేదు. మాకే కష్టం. పొరుగూరిలో టెంపరరీగా ఉన్న డాక్టర్, లంచం ఇచ్చి మన ఊళ్లో వేయించుకునేందుకు సిద్ధంగా ఉన్నాడట. ఆయన వైద్యం తెలియనిదేముంది. ఆ ఊరివారే మీ దగ్గరికి వస్తున్నారు. దాంతో ఆయనకి ఇక్కడినుంచి మిమ్మల్ని పంపేయాలనుంది."

"లంచం అన్నది నాకు గిట్టదు. నేను నమ్ముకున్న దారిలో నన్ను వెళ్లనివ్వండి. మీ 'ఆదరాభిమానాలు వదిలి వెళ్లడం నాకూ ఇష్టంలేదు' 'అని సంభాషణ ఆపేశాడు.

● ● ●

సర్వీస్ కమీషన్ ఇంటర్వ్యూలు అయ్యాయి. ఫలితాలు తెలిశాయి. వేణు పెంటపాడులోనే నియమితుడయ్యాడు. ప్రజల ఆనందానికి అంతులేదు. వేణుకి సన్మానసభ ఏర్పాటు చేశారు.

"నేను నమ్ముకున్న మార్గం నన్నెపుడూ పరాజయం పాలు చెయ్యలేదు. ఈ రోజుకూడా నేను సక్రమ మార్గంలోనే పెంటపాడులో నియమితుడిని కావడం అందుకు ఉదాహరణ. ఈ విజయానికి మూలకారణం నిష్కల్మషమయిన మీ ఆదరాభిమానాలే" అంటూ వేణు తన కృతజ్ఞత తెలియచేశాడు.

ప్రజలంతా హర్షధ్వానాలు చేయగా, అక్కడున్న ఒక పెద్దమనిషి తనలోతాను నవ్వుకున్నాడు.

● ● ●

అంటూ బేతాళుడు తన కథ ముగించి "రాజా, కథంతా విన్నావు కదా. సభలోని వారంతా ఆనందం వ్యక్తం చేస్తే, హర్షధ్వానాలు చేస్తుంటే తనలో తాను నవ్వుకున్న ఆ వ్యక్తి ఎవరు? ఎందుకలా నవ్వుకున్నాడు. జవాబు తెలిసికూడా చెప్పకపోతే నీ తల వేయి వ్రక్కలవుతుంది" అన్నాడు.

"డాక్టర్ వేణుయే తమ ఊరి వైద్యుడు కావాలనుకున్నారు ప్రజలు. గాలిలో దీపంపెట్టి, భగవంతుడిమీద భారంవేసి, కూర్చోవడం కోరికష్టాలను తెచ్చుకోవడమే, అనుకున్నారు. మార్గాన్వేషణ మొదలెట్టారు. మనసుంటే మార్గానికేం కొరత? కలికాలంలో కలియుగదైవంవంటి వేణుని, ఎలక్షన్లవరంగా తమకు నాయకులు ప్రసాదించిన డాక్టర్‌ని, ఆ ఎలక్షన్ల బేరంతోనే కాపాడుకోవాలని నిశ్చయించుకున్నారు. పంచాయితీ ఎలక్షన్లు రాబోతున్నాయి. పదవిలో ఉన్న ప్రెసిడెంటు దగ్గరికి వెళ్లారు గ్రామస్థులంతా- వేణుని పెంటపాడులో వేయించే భారం ప్రెసిడెంటుదేననీ ప్రతిఫలంగా ఆయన్ను గెలిపించే భారం తమదనీ, విషయం వేణుకి తెలియకూడదనీ, ఓటర్లుగా తమపై చెయ్యని వినియోగించే ప్రయత్నం చేశారు.

ఆ బ్రహ్మాస్త్రానికి తిరుగులేదు. ప్రజలు విజయం సాధించారు.

ఆ విజయానికి వెనుక- వేనుకదారిలో ఏర్పాటుచేసిన ప్రెసిడెంటు, వేణు మాటలకి, అతని నమ్మకానికి నవ్వుకున్నాడు."

అని విక్రమార్కుడు ముగిస్తుండగానే బేతాళుడు శవంతో సహా చెట్టుమీదకి వెళ్లబోయాడు. వెళ్లబోయినవాడు వెనక్కి తిరిగి, "రాజా!" అన్నాడు.

బేతాళుడి పిలుపు విన్న విక్రమార్కుడు, "వెనుదిరిగావు. నాతో రావడానికి నిర్ణయించుకున్నావా?" అన్నాడు ఆనందంగా!

"నాకో సందేహం మిగిలింది. మంచి జరగాలని చెడుమార్గాన్ని అనుసరించడమా? చెడు జరుగుతుందని తెలిసినా మంచిమార్గాన్ని వదలకపోవడమా? వీట్లో దేనిని సక్రమం అనాలి? దేనిని అక్రమం అనాలి?" అని ప్రశ్నించాడు బేతాళుడు.

జటిలమైన ఆ ప్రశ్నకి జవాబు దొరకని విక్రమార్కుడు మౌనంగా ఉండిపోయాడు. ■